

# అగ్రహారం కథలు
## వేదుల సుభద్ర



పేరులో ఒక రకమయిన రాజసాన్నీ, కొంత గాంభీర్యాన్నీ సంతరించుకుని ఆంధ్రదేశమంతటా ఉన్న చిన్న చిన్న గ్రామాలే అగ్రహారాలు. ఎదురెదురుగా చిన్నదీ, పెద్దదీ రెండు రాములవారి గుళ్ళూ, ఆ ఊరి దేవుడి కాళ్ళు నిత్యమూ కడుగుతూ అప్పుడప్పుడు వొద్దికగానూ, మరోప్పుడు కాస్త ఉగ్రంగానూ ప్రవహించే కౌశికగా పిలవబడే గోదావరి, వెనకే పచ్చదనాల నెచ్చెలులు వరిచేలూ, వాటికి కాపలాగా నిలుచున్న అన్నదమ్ముల్లాంటి కొబ్బరి చెట్లూ, ఇలా ఎంతో మనోహరంగా ఉన్న చోట ఎదురెదుగా రోడ్డుకిరువైపులా ఉన్న ఓ పాతిక ఇళ్ళని కలిపి ఒక ఊరుగా కట్టేస్తే అదే ఈ అగ్రహారం. అమ్మమ్మగారి ఊరు కావడమే కాకుండా, మరుగున పడుతున్న ఆచార వ్యవహారాలనీ, సంప్రదాయాలనీ, అనుబంధాలని మాకు రుచి చూపించింది కూడ అగ్రహారమే. చిలిపితనాల చిన్నతనాలూ, కలల అలల కౌమారాలూ, జీవితాన స్థిరపడే ప్రయత్నంలో ఉద్యోగాలూ, సద్యోగాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఇలా రకరకాల మెట్లు ఎక్కుతూ దిగుతూ మధ్యలో ఎక్కడో, ఎప్పుడో తెలియకుండానే పారేసుకున్న అమ్మ పెట్టిన కమ్మనైన తాయిలం లాంటి ఆ ఊరి జ్ఞాపకాలు ఇవి. మన ఇంట్లోనో, పక్కనో కనిపించి పలకరించే వ్యక్తుల్లాంటివే ఈ కథల్లో పాత్రలు. కొన్ని జరిగినవి, కొన్ని నే విన్నవీ , వీటికి కొద్దిగా నా సొంత కవిత్వాల రంగులూ, వర్ణనలూ, ఊహలు అద్దేసి ఆ చేనే(రా)తల కలనేతకి నేను పెట్టుకున్న పేరు అగ్రహారపు కథలు. - *రచయిత్రి(బెంగుళూరు)*

# పెద్దనాట ప్రభ...

**రాజమండ్రి స్టేషన్ ఎప్పటిలాగే గోలగోలగా రద్దీగా ఉన్నా** ఆ గోలకి కారణం ఎప్పటిలా కేవలం సోంపాపిడి, ఇడ్లీ, కాఫీలు అమ్మేవాళ్ళు మాత్రమే కాదు.. చాలా ఏళ్ళ తర్వాత కలిసిన నారాయణా, గోపాలం, సూరిబాబు, ఆనందం , సుబ్రమణ్యం అనే స్నేహితులు కూడా.

'ఆనందం' అనబడే ఆనందరావు అమెరికా నించీ, 'గోపాలం' అనబడే రామగోపాలం హైదరాబాదు నించీ, 'నారాయణా, నారిగాడు' అని పిలిచే నారాయణమూర్తి బెంగుళూరు నించీ రాగా 'సూరీ, చుంచూ' అనబడే సూరిబాబూ, 'సుబ్బిగాడనే' సుబ్రహ్మణ్యం మన కోనసీమ ప్రాంతం వారే. సూరిబాబు మన అగ్రహారంలోనే కొబ్బరివ్యాపారి అయితే సుబ్రహ్మణ్యం అగ్రహారానికి దగ్గరలోనే ఉన్న గంగలకుర్రు అనే గ్రామానికి చెందినవాడు. ఆయన అమలాపురంలోని హైస్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తారు. నారాయణమూర్తి సొంత ఊరు వ్యాఘ్రేశ్వరం, మిగతా ఇద్దరిదీ మన అగ్రహారం.

వీళ్ళ స్నేహానికి వయసు చాలా పెద్దదే. అడపా, తడపా కలిసే వీరు ఈ సారి దాదాపు పదేళ్ళ తర్వాత ప్రత్యేకంగా సంక్రాంతి సమయానికే కలవడానికి వెనక కారణాలు రెండు. మిత్రుడు సూరిబాబు తన అరవైయవ పుట్టినరోజు పండగ జరుపుకోబోవడం, ఎప్పుడో

చిన్ననాటి తర్వాత అందరికీ ఎంతో ప్రియమైన సంక్రాంతి పండగకి మళ్ళీ కలిసే అవకాశం రాకపోవడం వలన ఇప్పుడు వచ్చినదాన్ని సద్వినియోగం చేసుకోవాలనుకోవడం.

ఎవరు ఎవరితో ఏం మాట్లాడాలో తెలియటంలేదు. ఒకరినొకరు కౌగలించుకుని తర్వాత ఏం చెయ్యాలో, ఏం మాట్లాడాలో తెలియనట్టు బొమ్మల్లా ఉండిపోయారు రెండు నిమిషాలు. నెరిసిన చెంపలూ, జారిన బుగ్గలూ, ముక్కులమీదకెక్కిన చత్వారపు కళ్ళజోళ్ళూ, వెనక్కి వెళ్ళిన తలకట్లూ, కొద్దిగా ముందుకొచ్చిన బొజ్జలూ అందరికీ ఇంచుమించు సమానంగా మీదకొచ్చిన వయసుని పట్టిస్తున్నాయి. ఒకరినొకరు చూసుకోవడమే ఒక నిమిషం. తర్వాత ఎవరు ఎవరితో మాట్లాడుతున్నారో తెలియనంతగా మాటలు మొదలు పెట్టారు. అదే మనం ముందు చెప్పుకున్న గోలకి కారణం.

" ఏహే! ఎదవగోల, స్నేయితుల మాటినబడనీరు ఈ రేల్వే ఓళ్ళూ, అమ్మకపోళ్ళూ, మన సిన్నకారుకాడకెళ్ళిపోదాం రండి " అన్నాడు సూరిబాబు ఆనందం సూట్‌కేస్ డ్రైవర్‌కి అందిస్తూ.

అందరూ రాజమండ్రిలో కలవాలని ముందే అనుకున్నారు కనక అన్ని ఊర్లనించీ రైళ్ళు వచ్చేదాకా ఆగి మరీ బయలుదేరుతున్నారు. ఆరోతరగతిలో మొదలయిన స్నేహం వాళ్ళది. ఏ అంతరాలు ఎరగని బంధం అది. ఉద్యోగబాధ్యతలనించి విరమణ తీసుకుంటున్నారు గోపాలమూ, నారాయణా ఈ సంవత్సరం. ఆనందం కూడా 'వచ్చే సంవత్సరం ఇండియా వచ్చేస్తాను' అనుకుంటున్నాడు కనక వాడు వచ్చే సమయానికి, సంక్రాంతి వేళకి అందరూ కలిస్తే, తన అరవై ఏళ్ళ పండగకి కలిసి వస్తుందని సూరిబాబు ఉత్తరాల మీద ఉత్తరాలు, ఫోన్ల మీద ఫోన్లు చేసి మొత్తానికి అందరినీ బయలుదేరదీసాడు. పల్లెల్లో సంక్రాంతి ప్రత్యేకం అనుకుంటే, కోనసీమలోని సంక్రాంతి సంబరాలు చూడవలసినదే కానీ చెప్పనలవి కాదు.

అందరూ సతీసమేతంగా కార్లులో ఎక్కి కూర్చున్నారు.

" ఒరే చుంచూ! పెద్ద కారే కొన్నావురా.. " అన్నాడు నారాయణ. సూరిబాబుని చుంచుబాబు అనడం వాళ్ళకలవాటే.

" ఒరే మూడు జిల్లాలకే పేరెల్లిపోయిన కొబ్బరి యాపరస్థుడిని, మరీ సూరిగాడు, చుంచు అంటే బాగోదేమో " అని నసిగాడు సూరిబాబు.

" సర్లే.. ఐతే సూరిబాబుగారూ అంటాం లే " అని ఆనందం అందుకున్నాడు.

కారు నవ్వులతో తుళ్ళుతోంది. ఆడవాళ్ళు వెనక కూర్చున్నారు సర్దుకుని. ముందు ఇద్దరు, మధ్య సీట్‌లో ముగ్గురు..

" రాజమండ్రిలోనే పెద్ద ఒటేల్ ఇది.. ఇక్కడ టిఫినీల కాగుతామని సెప్పాను " అన్నాడు సూరిబాబు కారు ఆగగానే.

ఊళ్ళనించొచ్చిన మిత్రులు ముఖాలు చూసుకుని "మన స్కూల్ పక్కన పాక హొటల్ లేదా? అక్కడ దొరికే రొట్టెముక్కలు, శనగపిండి పచ్చడీ దొరకవా? " దిగులుగా మొహాలు పెట్టారు.

"అదా? వాళ్ళు ఉన్నారులే.. అక్కడే తిందాం పదండయితే" అన్నాడు..

అలా మెల్లిగా వరిచేలనీ, దారంతా తోడుగా పారుతున్న పిల్లకాలువలనీ, పలకరించికుంటూ మెల్లిగా అగ్రహారం వచ్చింది.

"ఇదేరా మనిల్లు.. నాన్నగారు కట్టించిన ఇల్లు అలాగే ఉంచి పక్కనే ఈ కొత్తిల్లు కట్టాను ఈ మధ్యనే.. ఆడోళ్ళు, పిల్లలూ పట్నవాసపు రుచులు మరిగారు కదా మరి! " అన్నాడు సూరిబాబు నవ్వుతూ.

అతను ముందే చెప్పేసాడు. తన పుట్టినరోజు అయ్యేవరకూ అందరూ తనింట్లోనే ఉండాలని. అందరికీ గదులు చూపించి స్నానాలకీ, భోజనాలకీ ఏర్పాట్లు అయ్యాయి. చలికి లెక్కచెయ్యని మిత్రులు ఆరుబయట మంచాలు వేసుకుని రగ్గులు కప్పుకుని పక్కన తేగలూ, చక్కిలాలూ పెట్టుకుని కబుర్లకుపక్రమించారు.

చిన్ననాటి ముచ్చట్లు ఎంత చెప్పుకున్నా తనివితీరని కబుర్లు. "ఎన్నాళ్ళయిందో మన ఊరు సంక్రాంతి పండగకొచ్చి. మన చిన్నప్పటిలా ఉన్నాయా? " అన్నాడు ఆనందం. అతని తల్లితండ్రులు పోయాక ఊరిలో ఉన్న అన్నయ్యింటికి ఓ రెండు రోజులు రావడం, వెళ్ళడం ఇలాగే జరుగుతోంది..

"పరవాలేదులే.. ఇంకా మర్చిపోకుండా పండగ చేస్తున్నారు, ఈ మధ్యన టీ.వీ చానెళ్ళ పుణ్యమా అని ఇదొక్క మంచి పని జరిగిందిలే. వాళ్ళు ఒకరితో ఒకరు పోటీ పడి సంప్రదాయపు కార్యక్రమాలు చెయ్యడం వల్ల మనుషుల్లోనూ సందడి వచ్చింది. మధ్యలో కొంత మరుగున పడిపోయినా అన్నాడు" సుబ్రహ్మణ్యం.

"అతే మనం భోగి మంట వేద్దాం" అన్నాడు గోపాలం చిన్నపిల్లాడిలా. ఆశ్చర్యంగా చూస్తున్న నారాయణతో అన్నాడు.

"అవునా, మళ్ళీ చిన్నతనపు సంక్రాంతిని జరుపుకుందాం. ఎక్కడ వదిలేసామో అక్కడే మొదలెడదాం. పెద్ద చదువులనీ, ఉద్యోగాలనీ, బాధ్యతలనీ ఇన్నాళ్ళూ తలమునకలయ్యేలా కష్టపడ్డాం కదా.. ఇప్పుడొక నాలుగురోజులు మనకోసం మనం కాంతి తెచ్చుకుందాం సంక్రాంతి పూట" అన్నాడు ఆనందం కూడా.

మర్నాటినించీ చూడాలి స్నేహితుల హడావుడి. పొద్దున్నే లేచి ఆవుపేడ తో భోగి పిడకలు గోడకేసి కొట్టారు. 'ఇంకా వారం ఉంది కదా, ఎండిపోతాయిలే !'అనుకుంటూ.

ఈ లోపున సూరిబాబు షష్టిపూర్తి హడావుడి. ఊరంతా భోజనాలూ, సత్యనారాయణ వ్రతాలూ, గుళ్ళో దేముడి కల్యాణం చేయించాడు. మూడు రోజుల్లోకి వచ్చింది సంక్రాంతి పండగ.

చిన్నతనాన్ని వెనక్కి తెచ్చుకునే ప్రయత్నంలో భాగంగా, ఆయాసపడుతూనే సైకిళ్ళు తొక్కారు కాలవ గట్టుదాకా. " వెధవది! కార్లు అలవాటయి కష్టం మర్చిపోయాం రా" అన్నాడు గోపాలం చెమట తుడుచుకుంటూ.

" మరే..ఇప్పుడు తెలుస్తోందా? రాత్రి గురక చూసి పొట్ట తగ్గించరా! అంటే నా మీదకెంత ఎత్తున లేచావ్?" అన్నాడు అందరిలోకీ ఫిట్‌గా చురుగ్గా ఉండే ఆనందం.

కాలవలో ఈతకొట్టారు. సూరిబాబు కొడుకులూ, కోడళ్ళూ, ఊరివాళ్ళూ వింతగా చూడటం మొదలుపెట్టారు.. అయినా స్నేహితులు పెద్దగా పట్టించుకోలేదు. అమలాపురం వెళ్ళి డీలక్స్ టాకీస్‌లో సినిమా చూసి వెనకాల ఉన్న బండి దగ్గర వంకాయా, మిరపకాయ బజ్జీలు తిన్నారు. 'కొలెస్టరాలూ, బీ.పీ అంటూ నా ప్రాణం తియ్యకు ఈ రెండు రోజులూ 'అని నారాయణ భార్యకి ముందే చెప్పాడు. జీళ్ళ దుకాణం దగ్గర ఆగి జీళ్ళు కొనుక్కున్నారు. బండారులంకలో అప్పుడే నేసిన చీరలు కొనుక్కొచ్చారు అందరికీ. తాము చదివిన స్కూల్, కాలేజీలకి వెళ్ళి అక్కడ బెంచీలమీద కాసేపు కూర్చుని మళ్ళీ అక్కడే చదువుకుంటున్నట్టు భావించి సంబరపడిపోయారు.

స్నేహితులందరికీ పట్టు పంచెలు కొన్నాడు సూరిబాబు. వారి భార్యలకి పట్టు చీరెలు.

తెల్లారితే భోగి పండగ.. " మనింటిముందే భోగి మంట వేయిద్దాం, ఏమంటార్రా! "అన్నాడు సూరిబాబు.

"వేయిద్దాం కాదు, వేద్దాం" అన్నాడు నారాయణ.

రాత్రంతా జాగారం చేసారు ఇంచుమించుగా. తెల్లారుఝామున మూడింటికి లేచి వెళ్ళి సుబ్బన్న గారి తోటలోంచి తాటి దుంగా, యాజులుగారి పెరట్లో పడేసిన విరిగిన కుర్చీ తెచ్చి భోగి మంట వేస్తున్న మిత్రులని ముప్పై నలభయి ఏళ్ళు వెనక్కి వెళ్ళిన కళ్ళతో చూసాడు సూరిబాబు.

చిన్నప్పుడు ఒకసారి ఇలాగే భోగి మంట కోసమని ఊరిచివర ఉండే బామ్మ తులశమ్మగారింటికి వెనక ఉన్న మావిడి కొమ్మకొట్టుకొచ్చారు. తమ సొంత పెరళ్ళల్లో ఎన్ని ఉన్నా, భోగి మంటకి పక్కవారివి ఎత్తుకురావడమే కుర్రవాళ్ళకి సరదా.. ఎవరు కొట్టారో

తెలియక అసలే పెద్ద నోరు కల ఆవిడ ఊరిలో పిల్లలందరినీ దుమ్మెత్తిపోస్తుంటే వెనక ఉండి నవ్వుకున్నారు. అది ఇప్పుడు గుర్తుకు తెచ్చుకుని నవ్వుకున్నారు, ఆవిడని తలుచుకుని జాలిపడ్డారు కూడా.

ఒకరికొకరు దిష్టి తీసుకుని దండలు అందులో వేసుకున్నారు. నూతిపళ్ళెంలో పీటలేసుకుని కూర్చుని పనివాళ్ళు నలుగు పెడుతుంటే నాలుగేసి గుండిగల వేడి నీళ్ళు పోసుకుని మురిసిపోయారు. 'తొట్టెస్నానాలూ, బకెట్ స్నానాలు వీటిముందు ఎందుకు పనికి వస్తాయి?' అని.

ఆ రోజు సూరిబాబు మనవలకీ, ఆనందం అన్నయ్య మనవలకీ చిన్నపిల్లలకి భోగిపళ్ళు పోసారు. పట్టుపరికిణీలు కట్టుకుని జడగంటలు పెట్టుకుని వాళ్ళ మనవరాళ్ళు "గొబ్బియళ్ళో,గొబ్బియళ్ళో " అంటూనూ, 'ఏల వచ్చెనమ్మ కృష్ణుడేల వచ్చెనూ?' అంటూ పాటలు పాడి గొబ్బి తట్టారు. ఇలా పొద్దున్నించీ క్షణం తీరికలేకుండా తిరగడమూ, పండగ సంబరాలలో మునిగి తేలడంతో మిత్రులు తమని తాము మరిచిపోయారు. ఒక్క నిమిషం వదలకుండా అన్నీ రికార్డ్ చేస్తున్నాడు ఆనందం.. 'నా మనవలకి చూపించడానికి' అంటూ.. మాషచక్రాలతో, పితృదేవతలకీ, పెద్దవాళ్ళకీ పెట్టిన వందనాలతో మధ్యపండగ ముచ్చటగ జరిగింది. 'గుమ్మడికాయ కూర వండి పిల్లలకి పెడితే వారు గుమ్మడిపళ్ళల్లా ఆరోగ్యంగా ఉంటారని 'అదీ వండారు. అరిసెలు. పూతరేకులు. బెల్లం మిఠాయిలు, జున్ను, జంతికలు ఇలా ఒకటేవిటీ ఎన్నో రకాలు అందరిళ్ళల్లోనూ పోటీ పడి మరీ తయారుచేసారు.

అందరూ కలిసి నాలుగు ఊళ్ళూ తిరిగారు. రాలీ జగన్ మోహినీ అవతారాన్నీ, మురమళ్ళ, ద్రాక్షారామం, పిఠాపురం, సామర్లకోట, అన్నవరం ఇలా అన్ని దేవస్థానాలని దర్శించారు. 'మావయ్యగారు ఎంత సంతోషంగా ఉన్నారో'! అని సూరిబాబు కోడళ్ళు అనుకున్నారు.

కనుమనాడు జరిగేదే కర్షకులకి అసలైన పండగ. పైగా కనుమనాడు ప్రత్యేకంగా జరిగే కోనసీమ ప్రత్యేకమైన పండగ ప్రభలతీర్థం. ఇది జరగడానికి రెండు మూడు చోట్ల జరిగినా మొసలపల్లి దగ్గర ఉన్న జగ్గన్న తోటలో జరిగే విధానమే వేరు.. దానికున్న ప్రాభవమూ వేరు.

"మనం చిన్నప్పుడెప్పుడూ ప్రభ కట్టనూ లేదు, ఎత్తనూ లేదు.. ఈ సారి కట్టవలసినదే, ఎత్తవలసినదే అది ఏ ఊరిది, ఎక్కడది అని మీరే తేల్చండి అన్నారు" ఊరినించి వచ్చిన ముగ్గురూ.

"మా అగ్రహారానికి ప్రభలేనేలేదు.. అందుకే మీరే చెప్పండి" అన్నాడు ఆనందం. వ్యాఘ్రేశ్వరం ప్రభ జగ్గన్నతోటకి ఎత్తైన ప్రభలలో ముఖ్యమైనది అని దానికెంతో ప్రాముఖ్యత ఉంటే, పంటపొలాలలోంచీ, చివరగా కాలవలో నడుము లోతు నీళ్ళల్లోంచి వచ్చే గంగలకుర్రు ప్రభ కున్న ప్రాముఖ్యత మరీ గొప్పది. .

"ఒరే ఈ వయసులో ప్రభలు కట్టడమేవిట్రా! చిన్నపిల్లల్లా, చక్కగా చిన్నకారేసుకునెల్లి చూసేసి రండి" అంది సూరిబాబు తల్లి..

"చిన్నప్పుడూ ఇలాగే ఎపుడూ పంపలేదు.. ఇన్నిపనులు చేసి అదొక్కటీ మాకు తీరని కోరిక అయిపోయింది.. ఈ సారి మాత్రం ఎవరు చెప్పినా వినేది లేదు" అన్నాడు గోపాలం కూడా. సరే.. "చూద్దాం ముందు మా ఊరు పోదాం రండి" అన్నాడు నారాయణ.

పెద్దపండగ మధ్యాహ్నం చెయ్యి కడిగిన తక్షణం కునుకైనా తీయకుండా బయలుదేరారు గంగలకుర్రు. భుక్తాయసంతో కునుకు వస్తోంది వాళ్ళకి.

గంగలకుర్రు చేరి అందరూ నారాయణ ఇంట్లో మకాం పెట్టారు. ప్రభ కట్టడానికి ఊరిలోని కుర్రకారు అంతా తయారవుతుంటే వీళ్ళు కూడా వారి వెంట పడ్డారు.

" పెద్దోరు మీకెందుకు బాబూ ఈపనులు? " అన్నారు వాళ్ళు.

ప్రభలు ఆరునించీ పదహారు అడుగుల వరకూ పొడుగున్న పెద్ద పెద్దవెదురు కర్రలూ, వాసాలూ అర్ధచంద్రాకారంలో వంచి ముందు ఫ్రేములా తయారు చేస్తారు.. దానికి పట్టుబట్టలూ, రంగు దారాలూ, చంకీలూ, పూసలూ, పువ్వులూ, నెమలికన్నుల గుత్తులూ, ధాన్యపుగుత్తులూ ఇలాంటి వాటితో అందంగా అలంకరించి, మధ్యలో ఊరి దేవుడి ఉత్సవవిగ్రహాన్ని కూర్చోబెడతారు. ఈ ప్రభలని 40-45 అడుగుల ఎత్తువరకూ చేసి, తాళ్ళతో బిగిస్తారు.. అమరిక చెదరకుండా. రకరకాల నామాలతో, రూపాలతో వివిధ ఊర్లలో కొలువున్న శివుడి దేవతా మూర్తులని ఊరేగించి ఒకచోట చేర్చే సంబరం ఈ ప్రభల తీర్థం. కుల మత, తర తమ భేదాలు లేకుండా ప్రజలందరినీ ఒక దగ్గర కలిపేదే ఈ పండగ.

' ఏమైనా సరే, మేమూ చేసి తీరవలసిందే' అని పట్టుబట్టారు స్నేహితులు ఐదుగురూ. ఎంతో ఆత్రంగా, భక్తిగా ప్రభని కట్టడంలో ఊరివారికి సాయం చేసారు. ఆనందమూ, నారాయణా అయితే పైకెక్కి మరీ పూలూ, అలంకారాలు అమర్చారు.

కనుమ పండగ నాడు పొద్దున్నే లేచి ఆయుధాలకీ పశువులకీ పూజలు చేసారు.. అందంగా కట్టిన ప్రభని జగ్గన్న తోటకి తీసుకువెళ్ళే సమయానికి తయారుగా వచ్చేసిన మిత్రులైదుగురునీ చూసి ఊరివాళ్ళు ఆశ్చర్యపోయారు.

"మీరేటీ బాబూ? " అని.

"మేమూ మోస్తాము మీతో పాటు" అందరిదీ ఒక్కటే సమాధానం.

"అయ్యబాబోయ్ ఇంకా నయం? మీవల్ల ఏటవుద్దండీ? ఇది అంత సులువు కాదు కదండీ. అందులోనూ మనూరి ప్రభ నీళ్ళలోంచి ఎల్లాలి కదా! "అన్నాడు ఎప్పుడూ ప్రభని దగ్గరుండి చూసుకునే ముసలయ్య.

"మాకు తెలుసు.. అయినా వస్తాము" అన్నాడు నారాయణ.

"నారాయణ బాబూ.. పొలాల్లోంచి , కాలవల్లోంచి మీరెల్లలేరు.. నా మాటినండి "అన్నాడు.

"కాలవలోంచి ఎందుకెళతారో తెలుసుగదండీ? ఒక్క ఏడాది వంతెనేసారు కదా, దానిమీదనించెళదారి అని ఎల్లమా అండి, ఆ ఏడు అగ్నిప్రమాదంలో మోసిన వారి ఇళ్ళు కాలిపోయాయి మీకు తెలుసు గదండీ.. మీ మాటకి ఎదురు సెప్తన్నాననుకోకండి.. ఆళ్ళందరూ కుర్రాళ్ళు, వయసుమీదున్న ఊపు, కొందరేమో బలం రాడానికీ, కష్టం తెలియకుండా ఉండడానికీ ఓ సుక్క ఏ సుకుంటారు కూడానూ", రహస్యం చెపుతున్నట్టుగా అంటూ, "ఈ పని మీ వొల్ల కాదు కానీ ఆనక ఊరేగింపుకెలదారి.. చిన్నకారులో జగ్గన్న తోటకొచ్చేయండి తీర్థానికి "అన్నాడు చిన్నపిల్లలకి నచ్చచెపుతున్నట్టూ.

అతన్ని చూసి గట్టిగా నవ్వారు అందరూ.. "చూస్తాములే ముసలయ్య ఒకసారి. ఎన్నోసార్లు అనుకున్నాం కానీ ఇప్పటివరకూ అవనే లేదు.. అంతగా కాకపోతే అప్పుడే వదిలేస్తాంలే! "అన్నాడు సుబ్రహ్మణ్యం నెమ్మదిగా. అతనెప్పుడూ ఏది చెప్పినా అనునయంగా నే చెపుతాడు.

చేసేదేమీ లేక ముసలయ్య 'సరే' అన్నాడు. 'ఒకాయన హైస్కూల్ మాస్టారు, మరొకాయన మూడు జిల్లాలకే పెద్ద వ్యాపారస్థుడు. ఒకబాబేమో ఈ ఊరి పెద్దకుటుంబానికి చెందిన వాడు. కాదనేదెలా? సరే అంతగా అవసరం పడితే మనవాళ్ళు ఉండనే ఉంటారు కదా' అని చెంగయ్య కూడా సర్ది చెప్పడంతో సరేనన్నాడు. మిత్రుల ఆనందానికి పట్టపగ్గాలు లేవు.

'హరహర మహాదేవ.. శంభో శంకర.. 'అంటూ ఊరేగింపు మొదలయ్యింది. గుడి దగ్గరనించి పల్లకీలో ఉత్సవవిగ్రహాలని తెచ్చి ప్రభ మధ్యలో కూర్చోబెట్టగానే. ముందర డప్పులూ, మేళతాళాలూ వెనక దేవుని ప్రభా, తర్వాత ఊరివారు. ప్రభ మీద కూడా దేవుని విగ్రహాలు స్థానభ్రంశం చెందకుండానూ, అలంకారాలు చెదరకుండా చూసేందుకు ఇద్దరూ, ప్రభలని ఊరేగింపుగా తీసుకుని వెళ్ళేటప్పుడు పైన కరంటూ తీగలూ, చెట్ల కొమ్మలూ అవీ తగలకుండా చూడటానికి మరికొందరూ ఎక్కుతారు. ఈ బరువంతా మోసుకుంటూ, ఏ ఒక్కటీ చెదరకుండా, కింద పడకుండా ప్రభని జగ్గన్నతోట దాకా తీసుకుని వెళ్ళడం చాలా కష్టమైన పనే.

కొండెక్కినంత ఆనందంతో అందరితో పాటూ ప్రభని భుజాలమీద పెట్టుకున్నారు. డప్పుల మోతలతో, కుర్రవాళ్ళ ఈలలతో పండగంటే ఇదే అన్నట్టుగా ఉండి మిత్రుల ఉత్సాహం మరింత పెరిగింది.

ఊరేగింపునంతా దగ్గరుండి చూసుకునే ముసలయ్య వీళ్ళగురించి భయపడుతున్నాడు. 'అలవాటూ లేదు, వయసూ కాదు' అని. రోడ్డుమీద ఉన్నంతసేపు పరవాలేదు. ఇప్పుడు ఇంక పొలాలలోకి వెళుతుంది. ఏపుగా ఎదిగిన పంటపొలంలోంచి పంటని తొక్కుకుంటూ వెళ్ళినా సరే రైతులు దానిని శుభంగా భావిస్తారు తప్ప ఏమీ గొడవ పెట్టరు. పైగా పరమానందం చెందుతారు.

అందరికీ మంచినీళ్ళూ అవీ చూస్తూ ముసలయ్య స్నేహితులని కూడా అడిగాడు.. " కొబ్బరి బొండం కొట్టించమంటారా అయ్యా? " అని.. ఎంతో ఉత్సాహంగా పిల్లలతో సమానంగా నడుస్తున్న వాళ్ళని ఆశ్చర్యంగా చూస్తూ. వారదేమీ పట్టించుకోకుండా ఒకటే కబుర్లలో ఉన్నారు.

"ఒరే !మనం పదో క్లాస్‌లో ఉన్నప్పుడు తీర్థానికొచ్చాము కదా, అప్పుడు దేవుళ్ళకి పదిరూపాయల పళ్ళు కొని ఫస్ట్ క్లాస్‌లో పాస్ చేయించమని మొక్కుకున్నాము గుర్తుందా? వెనక్కి వెళ్ళడానికి డబ్బులు చాలక సగం దూరం నడిచి వెళ్ళాం," నవ్వుతూ అన్నాడు నారాయణ.

"అవున్రోయ్.. అయినా నాకు పాస్ మార్కులే వచ్చాయ్. చదివి రాస్తే వస్తాయి కానీ అరటిపళ్ళేడితే వచ్చేస్తాయా? అందుకే ఇలా కొబ్బరికాయలమ్ముకుంటున్నాను" అన్నాడు సూరిబాబు మెడలో అడ్డు వస్తున్న పులిగోరు పతకాన్ని పక్కకి జరుపుకుంటూ.

"సరేలేరా.. ఫస్ట్ మార్కులొచ్చి నేనుద్ధరిస్తున్నదేవిటీ ? బ్రతకలేక బడిపంతులనీ.." అన్నాడు సుబ్రహ్మణ్యం.

"అలా అనకురా!. విద్యాదానం ఒక వరం. నలుగురికీ పంచే అవకాశం అందరికీ రాదు. ఎంత డబ్బు ఉంటే ఎక్కువ అవుతుంది? మనం అనుకోవడంలో ఉంది కానీ" అన్నాడు గోపాలం.

"నిజమే!. ఉద్యోగంపేరుతోనూ, కుటుంబంతోనూ ఇన్నిదేశాలు తిరిగాను కానీ ఈ గడ్డ మీద కాలు పెట్టాక కలిగిన భావన ఎక్కడా రాదేవిటో? "ఆనందం కూడా అన్నాడు.

"ఎక్కువ మాట్లాడకండోరే.. ఆయాసం వస్తుంది. "నారాయణ మాటలకి నవ్వాడు సూరిబాబు. "ఇప్పటికి రానట్టు".. అంటూ

ఇలా ఎప్పటివో కబుర్లు చెప్పుకుంటూ కుర్రాళ్ళతో సమానంగా నడుస్తున్నారు. అలసట అన్న మాటే పైకి అనకుండా తమతో సమానంగా నడుస్తున్న వీరిని ఆశ్చర్యంగా చూస్తున్నారు మిగతా వారు.

"అయ్యా! ఇంచుమించు వచ్చేసామండి తోటకాడకి.. ఇంక కాలవలో దిగేసి అద్దర ఒడ్డుకి ఎల్లిపోడమే. " ఇంక వదిలేస్తారా? అన్న అర్థంలో అడిగాడు ముసలయ్య..

"అప్పుడే వచ్చేసామా? భలే.. అసలు తెలియనే లేదు కబుర్లలో" అన్నారు భుజాలు, మెడలూ లాగేస్తున్నా సరే.. తెచ్చుకున్న ఉత్సాహంతో..

ఒక్కసారిగా మిన్నుముట్టిన జయజయధ్వానాలతో ఒక్క ఊపున అందరూ కాలవలో దిగారు. అధాటుగా దిగడంతో సూరిబాబు కాలు మడతపడింది అయినా పట్టు వదలలేదు అతను. చూస్తుండగానే పిల్లలందరూ ప్రభని ఒరిగిపోకుండా, కింద పడిపోకుండా తాళ్ళు జాగ్రత్తగా లాగి పట్టుకు న్నారు.

అందరితో పాటు వారు కూడా నీళ్ళల్లో దిగారు. నడుము లోతు నీళ్ళల్లోంచి ఎక్కడేముందో తెలియకుండా నడవడం వాళ్ళందరికీ చాలా థ్రిల్లింగ్గా ఉంది. మరో ఐదు నిమిషాల్లో ప్రభని కాలవ దాటించారు. తడిబట్టలతో, దేవుడిని మోసుకుంటూ వెళ్ళి జగ్గన్నతోటలో అప్పటికే సిద్ధంగా ఉన్న మిగతా ప్రభల పక్కన పెట్టి 'అమ్మయ్య' అనుకున్నారు.

అరవై ఏళ్ళవయసులోఎక్కడెక్కడినించో వచ్చి తమతో సమానంగా ఒక్క క్షణం ఆగకుండా వచ్చిన వీరు ఐదుగురినీ చూసి కుర్రాళందరూ ఆనందపడిపోయారు. ముసలయ్య కూడా. " ఎంత పని చేసారయ్యా? మీరు మోస్తామంటే ముందేదో అనుకున్నాను.. భలే వచ్చేశారయ్యా! పిల్లోల్లతో సమానంగా, అందరూ కులాసాగానే ఉన్నారు కదయ్యా? వేడిగా టీ ఏదైనా తెప్పించనా? ".. అన్నాడు.

"అది మా గొప్పకాదులే ముసలయ్యా! మనందరి భుజాలమీద ఎక్కాడే ఆయనదీ, లేకపోతే చిన్నప్పుడు ప్రభలు మోద్దామని సరదాపడ్డప్పుడు తిట్లూ, ఒక్కోసారి దెబ్బలూ తిన్నాము. చిన్ననాట తీరని  కోరిక ఈ ఈ వయసులో, ఈ ' పెద్దనాట ప్రభ ' రూపంలో, ఇలా తీరడమేమిటీ? చెప్పు" అంటూ చిన్నపిల్లల్లా తీర్థంలో బూరాలూ, ఖర్జూరాలూ కొనుక్కోవడానికి వెళ్ళిపోయారు స్నేహితులైదుగురూ.

ఎన్నో ఏళ్ళకి మళ్ళీ ఒకటైనవారిని చూసి, ఈ సంబరాన్నీ, స్నేహాన్నీ ఇలాగే కలకాలం  నిలుపుకోమని  ఒక్క చోట చేరిన అన్ని ఊర్ల  శివపార్వతులూ దీవించారేమో అన్నట్టుగా  సరిగ్గా నాలుగంటే నాలుగు చుక్కలు వాన జల్లు కురిసింది వారి మీద,  అచ్చం వారి స్నేహపు జల్లులాగే.

Click here to share your comments on this article